



అంగన్‌వాడీ కేంద్రాలపై నజర్

- సరుకుల వినియోగంపై ట్రాకింగ్
- దారి మళ్లకుండా చర్యలు
- ఎన్‌హెచ్‌టీఎస్ పేరిట ప్రతిరోజు పిల్లల హాజరు
- ఆహారంపై నివేదికలు
- స్మార్ట్ ఫోన్ ద్వారా ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్ సేకరణ
- వ్యతిరేకిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిర్మల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అవకతవకలను నిరోధించేందుకు ప్రభుత్వం ఈ దిశగా దృష్టి కేంద్రీకరించింది. దీనికోసం గాను న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టీఎస్) అనే విధానాన్ని తెరపైకి తెచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాల హాజరుతో పాటు ఈ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పోషకాహారం లెక్కలను ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పేరిట ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన నేపథ్యంలో ఈ యాప్‌ను వారంతా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా ప్రతీరోజు తమ హాజరుతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి ఎంత మంది పిల్లలు హాజరయ్యారు. వారికి ఎంత మేరకు పౌష్టికాహారం పంపిణీ చేశారన్న వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే తమ పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు కూడా పంపిణీ చేసిన ఆహార వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయలి. ప్రతిరోజు హాజరుతో పాటు పంపిణీ చేసిన పౌష్టికాహార వివరాలను కూడా నమోదు చేయాలి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు ఆఫీస్‌కి కాకుండా రాష్ట్రస్థాయి అధికారులకు సైతం తెలిసే అవకాశాలు ఏర్పడ్డాయి. గతంలో ప్రతినెల ఆఖరు తేదీన మాన్యువల్‌గా ఈ రిపోర్టులను సంబంధిత ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు సమర్పించేవారు. అయితే ఈ రిపోర్టులలో తప్పుడు లెక్కలు చూపుతూ స్టాక్ వివరాలను కూడా తలకిందులు చేస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయంటున్నారు. ఇలాంటి వ్యవహారాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టేందుకు ప్రభుత్వం న్యూట్రిషన్ హెల్త్‌ట్రాకింగ్ సిస్టంను ప్రవేశపెట్టి ప్రతీరోజు ఎఫ్‌సీఆర్ (ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్)ను ఆన్‌లైన్ అడుగుతున్నారు. అంగన్‌వాడీ వర్కర్లు పిల్లల హాజరు తీసుకొని ఆ తర్వాత వారికి పౌష్టికాహారం అందించడమే కాకుండా గర్భిణీలు, బాలింతలకు కూడా ఆహార పదార్థాలను పంపిణీ చేసిన తర్వాత ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్ తయారు చేసి ఆన్‌లైన్ లో మానిటరింగ్ సెల్‌కు అందించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం ద్వారా ఎంత మేరకు పౌష్టికాహారంకు సంబంధించిన సరుకులు పంపిణీ అయ్యాయనే అంశంతో పాటు ఎంత మేరకు వినియోగం జరిగింది. అలాగే ఎంత మేరకు స్టాక్ ఉందన్న వివరాలు ఎప్పటికప్పుడు తెలిసిపోనున్నాయి. ఈ నెల మొదటి తేదీ నుంచి అమలవుతున్న ఎన్‌హెచ్‌టీఎస్ విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్‌ను తయారు చేయాలంటే చాలా సమయం తీసుకుంటుందని అలాగే వివరాల నమోదులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని గ్రామాల్లో సిగ్నల్స్ పని చేయకపోతుండడం కూడా ఎఫ్‌సీఆర్ తయారీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు. వెంటనే ఈ విధానాన్ని తొలగించి గతంలో మాదిరి మాన్యువల్ గానే నివేదికలు పంపేందుకు అనుమతించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే భూషణ్ అభియాన్ యాప్‌లో అన్ని వివరాలు నమోదు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మళ్లీ ఎన్‌హెచ్‌టీఎస్‌ను అమలు చేస్తుండడం తమపై ఒత్తిడి పెంచుతుందని అంటున్నారు. ప్రతీరోజు తాము పౌష్టికాహార పంపిణీ వివరాలతో పాటు పిల్లల గ్రోత్ మేనేజ్మెంట్, డిజిటల్ రిజిస్టర్ల నిర్వహణ, రియల్ టైం డాటాను అమలు చేయడం లాంటి వివరాలను నమోదు చేయాలంటే తలకు మించిన భారంగా మారుతుందని వారు వాపోతున్నారు.

పకడ్బందీగా ఎఫ్‌సీఆర్

కాగా పిల్లల హాజరు లెక్కల వివరాలు అలాగే పంపిణీ చేసిన పౌష్టికాహారం స్టాక్ వివరాలన్నింటినీ ప్రతీరోజు నమోదు చేసేందుకు ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్‌ను రూపొందించారు. దీని ప్రకారం పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందించే బియ్యం, కోడిగుడ్లు, పప్పు, పాలు, నూనె, బాలామృతం, మురుకులు లాంటి స్టాక్ వివరాలను ప్రతీరోజు నమోదు చేయల్సి ఉంటుంది. ఈ వివరాలతో పాటు అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లల గ్రోత్ మేనేజ్మెంట్ వయసుల వారీగా, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య స్థితిగతుల వివరాలను ఈ యాప్‌లో ప్రతీరోజు నమోదు చేయాలి. అలాగే డిజిటల్ రిజిస్టర్స్ మెయింటెన్‌తో పాటు రియల్ టైం డాటాను కూడా వారు ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా నిర్మల్ జిల్లాలో మొత్తం 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఈ కేంద్రాలలో 62 వేల 688 మంది పిల్లలు నమోదై ఉన్నారు. వీరికే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నమోదై ఉన్న 6 వేల 597 మంది గర్భిణీలు, 6 వేల 154 మంది బాలింతలకు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

తలకు మించిన భారంగా మారింది

లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ)

తామంతా ఇప్పటికే పోషణ్ అభియాన్ యాప్ ద్వారా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపుతున్నాం. మళ్లీ ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ పేరిట మరో యాప్‌ను ప్రవేశపెట్టి ప్రతిరోజు ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్‌లను తయారు చేసి పంపాలని ఆదేశించడం తమకు భారంగా మారుతుంది. బీఎల్‌వో డ్యూటీలు నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను కొనసాగించడమే కాకుండా ఇలా రోజుకో కొత్త రిపోర్ట్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపడం తమకు తలకు మించిన భారంగా మారుతుంది. వేతనం తక్కువగా ఉన్నప్పటికీ ఇప్పటికే అనేక రకాల ప్రభుత్వ పరమైన పనులను చేస్తున్నాం. పని భారంతో తాము మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ దిశగా దృష్టి సారించి ఎన్‌హెచ్‌టీఎస్ విధానాన్ని నిలిపి వేయాలి.

పారదర్శకత కోసమే

ఫైజాన్ అహ్మద్, జిల్లా అడిషనల్ కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పారదర్శకత కోసమే ఎన్‌హెచ్‌టీఎస్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ప్రతిరోజు ఫుడ్ కన్సల్టేషన్ రిపోర్ట్‌లను అంగన్‌వాడీ ఉద్యోగులు నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో ఎంత మందికి పౌష్టికాహారం అందుతుందనే వివరాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో నిల్వ ఉన్న ఆహార సరుకుల వివరాలు కూడా ఉన్నతాధికారులకు తెలిసిపోనున్నాయి.



నగదు కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

బాసర ఆలయంలో హుండీ లెక్కింపు

బాసర, మే 27 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కింపు చేపట్టారు. రూ. 77,77,746 నగదు, మిశ్రమ బంగారం 126 గ్రాములు, మిశ్రమ వెండి మూడు కిలోల 440 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన 17 కరెన్సీలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 60 రోజుల్లో ఆలయానికి సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రచారం రానున్న నాలుగు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాలలో ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు నదు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ తీగలు తెగినట్లయితే లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే సంబంధిత విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అత్యవసర అవసరాల కోసం జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 6305646600ను సంప్రదించాలని, రైతులు తమ పంటలను సురక్షితంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బెస్ట్ ప్రాక్టీస్ ఉపాధ్యాయుల ఎంపిక



నిర్మల్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యుత్తమ బోధన ప్రదర్శించిన ముగ్గురు ఉపాధ్యాయులను మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపిక చేశారు. బెస్ట్ ప్రాక్టీస్‌లో భాగంగా 88 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎం.ఎల్లన్న (భైంసా), జాడి శ్రీనివాస్ (మస్కాపూర్), ఏ.ప్రవీణ్ (లోకేశ్వరం) ఎంపికయ్యారు. విద్యాశాఖ సంచాలకులు వీరిని మర్రి చిన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో అభినందించారు. ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ జి. రమేష్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ సుభాష్‌బాబు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దిమ్మదుర్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

మామడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆందోళన చెందవద్దని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రోజున మండలంలోని దిమ్మదుర్తి ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆంధ్రజ్యోతి సంచికలో 'గన్ని బ్యాగుల కోసం ఆందోళన' అనే శీర్షికకు స్పందించి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి తడిసిన ధాన్యాన్ని సైతం కొంటామని, ఎవరు ఆందోళన చెందవద్దు. రెండు రోజుల్లో పూర్తి బ్యాగులు రైస్‌మిల్‌కు తరలిస్తామని తెలిపారు. అనంతరం ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి కొనుగోలు సెంటర్‌లో త్వర త్వరగా రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సుధాకర్, ఏపీఎం అరుణ, ఏపీవో శివాజీ, సీసీలు రవీందర్, సతీష్, టీఏలు రవి, తదితరులున్నా పాల్గొన్నారు.


సీఎస్‌ను కలిసిన మాజీ మంత్రి ఐకే రెడ్డి



నిర్మల్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనను అభినందించి శాలువాతో సన్మానించారు. గతంలో ఆయన ఆదిలాబాద్‌లో పనిచేసిన సమయంలో ఉన్న అనుభవాలను మంత్రి పంచుకున్నారు.

← సీఎస్‌ను సన్మానిస్తున్న ఐకే రెడ్డి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించిన గొప్ప నేత నెహ్రూ



జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలదండ వేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించిన గొప్ప నేత భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. మంగళవారం జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో ఆత్మచైర్మన్ కొండ్ర రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెహ్రూ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ స్వాతంత్రంలో కీలకపాత్ర పోషించినటువంటి గొప్ప నేత నెహ్రూ అని తెలంగాణ ప్రాంతానికి ముఖ్యమైనటువంటి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నిర్మించి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసినటువంటి గొప్ప నాయకుడు నెహ్రూ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు జీసస్ అలీ, పట్టణ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు అంబాజీ, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే పార్టీలు.. అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి పాటుపడుతా
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- రూ. 20 కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- బ్రహ్మన్‌గాంలో జీపీ భవనం ప్రారంభించిన మంత్రి
- లోకేశ్వరంలో ఘనంగా కుమరం భీం విగ్రహ ఆవిష్కరణ



బ్రహ్మన్‌గాంలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి



కుమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

ముథోల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాయకులు ఎన్నికల అప్పుడే పార్టీ పరంగా ప్రచారం చేయాలి కానీ అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.అనసూయ సీతక్క అన్నారు. జిల్లా ముథోల్ మండలంలోని బ్రహ్మన్‌గాం గ్రామంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన ప్రారంభించారు. నియోజకవర్గంలోని సీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణంకు, తానూర్ నుంచి హుండా గ్రామం వరకు ఎంఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.5.90 కోట్లతో బీటీ రోడ్డుకు, కుంటాల నుంచి దౌనెల్లి వరకు బీటీ రోడ్డుకు రూ.కోటి తొంభై లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అందరూ కలిసి పని చేసినప్పుడే గ్రామాలు అభివృది చెందుతాయన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, సీసీ రోడ్లు, ప్రాజెక్టులతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ఎల్లవేళలా ముందు ఉంటానని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాకు నీటి విషయంలో ఏళ్ల నుండి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నదులున్నప్పటికీ ఉపయోగంలోకి రాలేదని అన్నారు. ప్రాజెక్టుల విషయంలో గాని, లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో ముందు ఉంటూ రైతుల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. నేడు రూ. 20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని పేర్కొన్నారు. మండలంలోని బ్రహ్మన్‌గాం ఇరిగేషన్‌తో పాటు పంచాయతీ రోడ్లు ఆర్ అండ్ బి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూ రు చేసి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. బ్రహ్మన్‌గాం గ్రామంలో 13 మందికి నిరుపేద అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను మంత్రి అందజేశారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ... బ్రహ్మన్‌గాం లిఫ్ట్ ఇరిగేషన్, రోడ్ల మరమ్మతులు చేసి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. మంత్రి తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, అడిష నల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్‌కుమార్, ఎస్పీ జానకీషర్మిల, సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో సుదర్శన్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి

కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసి ఉండి ప్రజల్లోకి వెళ్తే ఫలితాలు మనవే అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ముథోల్ మండలంలోని బ్రహ్మన్‌గాం గ్రామంలో కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు వస్తాయని చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రతి ఒక్కరూ నడచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కోసం అంకిత భావంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు మనమే సాధించాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లినట్లయితే త్వరలో జరగబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం మనదేనన్నారు. పని చేసే కార్యకర్తకి క్యాడర్ గుర్తిస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి మనస్పర్థలు లేకుండాముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, సోయం బాపురావు, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, నాయకులు రాంరెడ్డి, రాజన్న, సురేందర్, బుచ్చన్న, వెంకటేష్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కుమరం భీం విగ్రహ ఆవిష్కరణ


లోకేశ్వరం, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంత్రి సీతక్క మంగళవారం ఆదివాసీ ముద్దుబిడ్డ కుమరం భీం విగ్రహ ఆవిష్కరణ చేశారు. వేలాది మంది ఆదివాసీ నాయక్‌పోడ్ ముద్దుబిడ్డల, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా విగ్రహ ఆవిష్కరణ చేశారు. అటు పక్కనే ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు మాట్లాడుతూ... ఆదివాసీ నాయక్‌పోడ్‌లు చాలా ఏళ్లుగా అన్ని రకాలుగా నష్టపోతున్నారని, చాలా వెనుకబడి ఉన్నారని, ఆదివాసీలకు కొన్ని ప్రాంతాల్లో కులానికి సంబంధించిన సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా ఆదివాసీ నాయక్‌పోడ్‌లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే బ్యాంక్‌లలో రుణాలు మంజూరు అయ్యేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు ప్రభుత్వం విద్యాపరంగా, ఆర్థికపరంగా అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోరిల్లా పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమరం భీం అన్నారు. అడవిని జీవనోపాధిగా చేసుకొన్న కుమరం భీం నిజాంలను ఎదిరించాడని తెలిపారు. నిజాం సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలతో పోరాటం చేశాడన్నారు. పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా ఉద్యమించాడని జల్ జంగల్ జమీన్ (భూమి, అడవి, నీరు మాదే) అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందాడని కొనియాడారు. కుమరం భీం ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్, ముథోల్ నియో జకవర్గం మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, సోయం బాపురావు, సుగుణక్క, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, లోకేశ్వరం సర్పంచ్ సౌజ న్య కపిల్, లోకేశ్వరం ఎంపీటీసీ జయసాగర్‌రావు, రాజేష్‌బాబు, ఎం. శ్రీధర్, చిన్నారావు, సాయన్న, సుదర్శన్, షఫీ, ప్రసాద్, సుధీర్ రెడ్డి, సుమన్, వివిధ గ్రామల ఆదివాసి నాయక్‌పోడ్ అధ్యక్షులు, కార్యద ర్శులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు గట్టి పోలీసు బందోబస్తు

ముథోల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గంలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటన ఉండడంతో ఎస్పీ జానకి షర్మిల నేతృత్వంలో అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. సీఐ మల్లేష్‌ఎస్సై సంజీవ్‌లు బందోబస్తు నిర్వహించారు. బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వారిని సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. మంత్రి పర్యటన సజావుగా సాగింది.

బీఆర్‌ఎస్ ప్రతినిధుల ముందస్తు అరెస్టులు.. గృహ నిర్బంధాలు

భైంసా, మే 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో మంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా సజావుగా కొనసాగేందుకు గాను పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ప్రతినిధుల ముందస్తు అరెస్టులను చేపట్టారు.. ఆయా ప్రాంతాల్లోని బీఆర్‌ఎస్ ప్రధాన నాయకులను సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది వారి వారి ఇళ్లలోకి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.భైంసా పట్టణంలోని సంజయ్‌గాంధీ మార్కెట్ పరిధిలో బీఆర్‌ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి విలాస్ గాదేవార్, విజయలక్ష్మీ కాలనీ పరిధిలో మరో సమన్వయ కమిటీ ప్రతినిధి డా.పడకంటి రమాదేవితో పాటు పార్టీ ప్రతినిధులను టౌన్ సీఐ గోపినాథ్ నేతృత్వంలో ఎస్‌ఐ గౌస్ హౌస్ అరెస్టు చేశారు. ఇక మంత్రి సీతక్క పర్యటన చేపట్టిన రోడ్డు మార్గంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మంత్రి పర్యటనలో ఆటంకాలు ఏర్పడకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు.



భైంసాలో హౌస్ అరెస్టులో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు

లక్ష్మణచాందలో మాజీ సర్పంచ్‌ల అరెస్టు



ముందస్తు అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు

లక్ష్మణచాంద, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాజీ సర్పంచ్‌లను మంగళవారం అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌ల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్లు ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పలువురు సర్పంచ్‌లు హైదరాబాద్ తరలి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తాజా మాజీ సర్పంచ్‌లు గత చాలా కాలంగా పోరాటం చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. జూన్‌లో సర్పంచ్ ఎన్నికల కోసం నోటిఫికేషన్ వస్తుందన్న సమాచారం మీడియా ద్వారా గత రెండు రోజుల నుండి ప్రచారం అవుతున్న తరుణంలో రాష్ట్ర కమిటీ ఈ పిలుపునిచ్చింది. దీంతో సీఎం ఇళ్లు ముట్టడి కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు తరలిపోకుండా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి, లక్ష్మణచాంద సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, నాయకులు అట్ల రాంరెడ్డి, కే. జీవన్ రెడ్డి, కమల్‌కోట వెంకట్ రెడ్డి, బుర్రి భూమేష్, తదితరులున్నారు.



పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తరలిస్తున్న ఎస్సై సంజయ్

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఇచ్చోడ, మే 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఎస్సై సంజయ్ అన్నారు. 'రద్దీ రోడ్లపై దర్జాగా పార్కింగ్' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎస్సై పురుషోత్తం స్పందించారు. రోడ్డుపై పార్కింగ్‌లో ఉంచిన వాహనాలను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్డుపై నిలిపిన వాహనాలకు జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. బారీ వాహనాలు రోడ్డుపై నిలిపి వాహన డ్రైవర్ వాహనాన్ని వదిలి వెళ్లకూడదని, రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపరాదని సూచించారు. ఇందులో సిబ్బంది లక్ష్మినారాయణ, విష్ణువర్ధన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు'

ఉట్నూర్, మే 27(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లోని గ్రామీణ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు మగ్గం వర్క్సలో ఉచిత శిక్షణ కల్పించనున్నామని ఆర్‌సెట్ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న మహిళలకు, పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత వసతి, భోజనం, బస్సు చార్జీలు రెండు జతల యూనిఫాంలు, టూల్ కిట్స్‌తో పాటు శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆసక్తి ఉన్న మహిళలు ధ్రువపత్రాలతో జూన్ 1వ తేదీ లోగా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ రెండు నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఇతర వివరాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల లోపు ఫోన్ నెం. 9949412159, 8985633226, 9441530494, 8096093085 ద్వారా సంప్రదించాలని సూచించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైనందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సద్దాం అన్నారు. మంగళవారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళా, యోగ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ ఉంటుందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నీటి నిలువ గుంతలు లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

నార్నూర్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): కూలీల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాకు సక్కు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గాదిగూడ మండలం పరస్వాడా గ్రామంలో రైతు కూలీలతో కలిసి 'చలో కలెక్టరేట్' గోడప్రతిని విడుదల చేశారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు రోజుకు రూ.600, 200 రోజుల పని దినాలు కల్పించాలని పేర్కొన్నారు. రూ.10 లక్షలు బీమా సౌకర్యం ఇవ్వాలన్నారు. సంబంధిత అంశాలపై జరిగే మహా ధర్నా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కొడప ఇశ్వర్, పర్చకే అంబరావు, బాపు రావు, సోనేరవు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

● జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్

తలమడుగు, మే 27(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మిపూర్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషన్ మాట్లాడుతూ తెలంగాణ-మహారాష్ట్ర అంతర్ రాష్ట్ర రహదారిలో గల లక్ష్మీపూర్ వద్ద పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా పశు సంవర్ధక శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. అయితే, బక్రీద్ పండగ సందర్భంగా ఆవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహనాల తనిఖీని చేపట్టినట్లు ఎవరైనా ఆవులను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అదే విధంగా కేసు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా అక్రమంగా పశువులను తరలిస్తున్నా.. ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి లావణ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



● లక్ష్మంపూర్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్

బోథ్‌లో భారీ వర్షం.. జొన్న రైతు సతమతం

● సంతలో మోకాలి లోతు నీళ్లు



బోథ్ సంతలో మోకాలి లోతులో పారుతున్న నీరు

బోథ్, మే 27 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల సంతలో భారీగా వర్షం నీరు చేరి మోకాలి వరకు రోడ్లపై ప్రవహించింది. ఫలితంగా సంతకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు వ్యవసాయం మార్కెట్ కమిటీ ఆవరణలో జొన్న పంటను తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తమ పంటలను కాపాడుకునేందుకు రైతులు సతమతమయ్యారు. అరగంట పాటు కురిసిన వర్షం వల్ల జనజీవనం స్తంభించింది.



బోథ్ మార్కెట్లో తూకం కోసం తెచ్చిన జొన్న పంట

'ఆటో ఆకలి కేకలు' సభకు తరలివెళ్లిన ఆటో డ్రైవర్లు

బోథ్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల నుంచి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఆటో ఆకలి కేకలు సభకు ఆటో డ్రైవర్లు భారీ సంఖ్యలో మంగళవారం తరలి వెళ్లారు. అంతకుముందు కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ప్రభుత్వం 2023 ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం వల్ల ఉపాధిని కోల్పోయామని వారు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం కష్టం కాక ఆటో కోసం తెచ్చిన డబ్బులు కిస్తీల వారిగా కట్టలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ ఆదుకునే విధానం ప్రత్యామ్నాయంగా సంవత్సరానికి ఇస్తామని చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు సాకేత్ రాజుతో పాటు పలువు డ్రైవర్లు ఉన్నారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న డ్రైవర్లు

ఆదర్శ పాఠశాలలో7వ తేదీలోపు ప్రవేశం

బోథ్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన మోడల్ స్కూల్ ప్రవేశ ఫలితాలు సాధించిన విద్యార్థులు జూన్ ఏడవ తేదీలోపు ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫలితాల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు టీసీ, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు.

తక్షణ ఆర్థిక సహాయం అందజేత

ఉట్నూర్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులగూడకు చెదిన కొడప లక్ష్మికి రూ.పది వేల నగదు తక్షణ ఆర్థిక సహాయం కింద మంగళవారం అందించామని డివిజనల్ ఆఫీసర్ రేవంత్‌చంద్ర తెలిపారు. ఆదివారం రాత్రి కొడప లక్ష్మణ్‌పై అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపరడంతో మృతి చెందాడు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ద్వారా కూడా పరిహారం అందజేస్తామన్నారు. ఇందులో డీఆర్‌ఓ సీతారాం, ఎఫ్‌బీఓ రామ్‌కుమార్ ఉన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి : బీఎస్‌ఆర్

మావల, మే 27(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మొదలైన పోడు లొల్లి!

(5వ పేజీ తరువాయి...)

గ్రామంతో పాటు బోథ్ మండలం కౌట(బి) గ్రామ పరిధిలోని పోడు భూముల్లో పంటలను సాగు చేయవద్దంటూ అధికారులు అడ్డు చెప్పడంతో వివాదానికి దారి తీసింది. అలాగే జిల్లాలోని చాలా గ్రామాలలో అటవీ శాఖ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగడంతో చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అప్పు చేసి పంటలను సాగు చేస్తున్నా.. అటవీ శాఖ అధికారుల హెచ్చరికలతో అయోమయ పరిస్థితులకు దారి తీస్తుంది. అంతేకాకుండా ఇప్పటికే కొన్ని మండలాల్లో గుర్తించిన పోడు భూముల్లో గుంతలు తవ్వుతూ మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో అటవీ శాఖ, అన్నదాతల మధ్య ఘర్షణ వాతావరణం కనిపిస్తుంది. అయితే పోడు సమస్యకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రతియేటా వానాకాలం సీజన్‌లో అటవీ శాఖ అధికారులతో స్థానిక పోడు రైతులు ఘర్షణకు దిగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

మద్యం మత్తులో కూలీ ఆత్మహత్య

తాంసి, మే 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యవసాయ కూలి పరుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన తాంసి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన అనుప నారాయణ(30) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు తన యజమాని పంట చేనుకు పని కోసం వెళ్లి.. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో భాస్కర్ తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య ఆత్మహత్య.. భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): భార్యను మానసికంగా వేధించి ఆత్మహత్యకు కారణమైన భర్తకు మంగళవారం జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాజ్యలక్ష్మి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. బేల మండలం సిర్సన్నకు చెందిన దండేపల్లి నర్సయ్య భార్య దేవత అలియాస్ భూమికను తరచూ వేధించడంతో ఆమె 2019లో ఆత్మహత్య చేసుకుంది. భర్తపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా జడ్జి తీర్పునిచ్చారు.

'వలస నేతల పెత్తనాన్ని సహించేది లేదు'

ఆదిలాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో వలస నేతలదే పెత్తనం కనిపిస్తుందని మాజీ డీసీసీ చైర్మన్ భార్గవ్‌దేశ్ పాండే ఆరోపించారు. మంగళవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ వర్గీయులతో సమావేశమై విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎవరు అసలైన కాంగ్రెస్‌వాదులో ప్రజలకు తెలుసన్నారు. సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యత లేకుండానే పోయిందన్నారు. గత కొన్నేళ్లుగా పార్టీ కోసం పని చేసిన వారికి అసలు గుర్తింపే లేదన్నారు. వలస నేతలు పెత్తనం చలాయిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత రెండేళ్లుగా ఓపికగా ఉన్నామని, ఇకపై ఊరుకునేదే లేదన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో తమ సత్తా ఏమిటో చూపుతామని పేర్కొన్నారు. ఇకపై ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే సీనియర్ నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ప్రకటించారు. అశోక్, మంగేష్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ డీసీసీ చైర్మన్ భార్గవ్‌దేశ్ పాండే

ఏళ్లుగా సాగులో ఉన్నరైతులను
వెళ్లగొట్టాలని చూడడం సరికాదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న దుర్గం నూతన్‌కుమార్

ఖానాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడిగా పోడు భూముల్లో సాగులో ఉన్న రైతులను వెళ్లగొట్టాలని చూడడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సందర్భంగా గత 40 ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం చేస్తున్నటువంటి భూములలో ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు సాగును నిలిపి వేయాలని రైతులను హెచ్చరించడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పెంబి మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో పోడు భూములలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటేందుకు వెళ్లడం సరికాదన్నారు. పోడు భూముల్లో సాగును నిలిపి వేయాలంటూ రైతులను బెదిరించి వారి నుండి డబ్బులు వసూలు చేయడం ఎదిరించిన వారిపై కేసులు పెట్టడం అటవీ శాఖ అధికారులకు ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. ఇకనైనా పోడు రైతుల పట్ల అటవీ శాఖ అధికారులు తమ తీరును మార్చుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖానాపూర్ ఏరియా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మురళీమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు రాజేష్, నాయకులు నరేష్, శంకర్, తదితరులున్నారు.

ఎకో టూరిజం ప్రాంతాన్ని
పరిశీలించిన శిక్షణ బీట్ ఆఫీసర్లు



తుర్కం చెరువులో శిక్షణ బీట్ అధికారులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ రావు

మామడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్దుర్తి తుర్కం చెరువు ఎకో టూరిజం ప్రాంతాన్ని 37వ బ్యాచ్‌కు చెందిన 40 మంది శిక్షణ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వెంకన్న చెరువును సందర్శించి ఎకో టూరిజం, బర్డ్ వాచింగ్, బొటనైజేషన్ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... వన్యప్రాణి సంరక్షణ బాధ్యతగా తీసుకొని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ కొండల్ రావు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నర్సాపూర్(జి), మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 33 కేవీ సబ్ స్టేషన్‌లో మూడు నెలల కింద పాడైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. మంగళవారం మధ్యాహ్నం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు.

లోతు దుక్కులతో భూమికి సత్తువ



పత్తి చేనును కలియ దున్నుతున్న రైతు



వేసవిలో లోతు దుక్కి చేసిన భూమి

దిలావర్‌పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : యాసంగి పంటల తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలా మంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతు దుక్కులు చేస్తే బోలెడు లాభాలు ఉన్నాయి. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. రైతులు అవగాహన లేమితో భూమిని దున్నకుండా అలాగే వదిలేయడం వల్ల కలుపు మొక్కలు, చీడపీడలతో తీవ్రంగా నష్టపోతున్నారు. లోతు దుక్కుల వల్ల భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు నివారణతో పాటు మరిన్ని ప్రయోజనాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

లోతు దుక్కితో లాభాలు అనేకం

- వేసవి కాలంలో లోతు దుక్కులతో రైతులకు చాలా ప్రయోజనాలు చేకూరతాయి.
- వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది.
- లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది.
- భూమిలో తేమ శాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ జరుగుతుంది.

● వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, కంపోస్టు ఎరువు, నల్ల మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట, దిగుబడి పెరుగుతుంది.

● దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలు, అడ్డంగా దున్నడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

● లోతు దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడంతో అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థంగా మారుతుంది. ఫలితంగా భూసారం పెంపొందుతుంది. లేదంటే సేంద్రియ ఎరువులను వెదజల్లాలి.

● సాధారణంగా రైతులు పంట చేతికి అందగానే పంట నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా అవకాశం ఉన్న వారు కలియ దున్నాలి. దుక్కులు చేయడంతో నేల పొరల్లో కలిసిపోయి, ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది.

● పంటకు కావాల్సిన పోషక పదార్థాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంట కోత దశల్లో వాటి నిద్రావస్థ దశలో నేల, చెత్తా చెదారం, కోయ కాడల్లో ఎక్కువ కాలం గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. దుక్కి చేయడం వల్ల అవి నాశనమవుతాయి.

● అకాల వర్షాలు తగ్గాక దుక్కి చేసినా మేలే

రైతులు సీజన్‌కు ముందుగా వేసవిలో లోతు దుక్కులను చేసుకోకపోవడంతో కలుపు పెరిగి రైతుకు అదనపు భారంగా మారుతుంది. పంట లేని సమయంలో కలుపు మొక్కలు పెరిగి అవి భూమిలోని నీరు, పోషక పదార్థాలను ప్రత్యక్షంగా గ్రహించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అంతేకాకుండా అనేక రకాల పురుగులు, శిలీంద్రాలకు ఆశ్రయాన్ని కల్పించడం ద్వారా పరోక్షంగా పంట నష్టానికి కారణమవుతాయి. వేసవిలో లోతు దుక్కులతో పాతుకుపోయిన కలుపు మొక్కలతో పాటు వాటి విత్తనాలు నేల పైపొరల్లోకి చేరి నశిస్తాయి.

వేసవిలో దుక్కి చేయని రైతులకు ఇదే సరైన సమయం

యాసంగి సీజన్ దాదాపుగా ముగిసింది. రైతులు సాగు చేసిన పంట ఉత్పత్తులు చేతికొచ్చాయి. కొంత మంది రైతులు వేసవి లోతు దుక్కులు ఇప్పటికే పూర్తి చేశారు. పంటలు ఆలస్యంగా రావడంతో కొంత మంది రైతులు వేసవి దుక్కులు ఇంకా చేయలేదు. అంతలోపే వర్షాలు కురువడంతో ఇప్పుడు దున్నవచ్చా లేదా అన్న మీమాంసంలో రైతులు ఉన్నారు. ఇప్పుడు సాగు భూములు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ సమయంలో భూసారం పెరిగేల రైతులు సరైన జాగ్రత్తలు తీసుకుంటే వానకాలం పంటలకు ఎలాంటి ఇబ్బందులుండవని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అప్పుడు లోతు దుక్కులు చేయలేని వారికి చేసుకోవడానికి ఇదే సమయమంటున్నారు. ఇప్పుడు చేయడం వల్ల ఈ వర్షాలకు మొలకెత్తిన కలుపు మొక్కలు నాశనమవుతాయి. వానకాలం పంటల్లో తెగుళ్ల, కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.

రైతులు కలియ దుక్కులు చేపట్టాలి

● రాజశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, దిలావర్‌పూర్

లోతు దుక్కులతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుంది. చీడపీడల నివారణతో పాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. జూన్ నెల రానేవచ్చింది. ఇప్పటికే రైతులు సాగుకు సిద్ధంగా ఉన్నారు. కొంత మంది రైతులు వెనకబడి ఉన్నారు. వర్షాలు తగ్గాక కలియ దున్నుకోవాలి. ముఖ్యంగా పత్తి సాగు చేసే రైతులు లోతు దుక్కులు చేస్తే చాలా మంచిది.

పోడు రైతులకు, అటవీశాఖ అధికారుల మధ్య వాగ్వాదం



మొక్కల గుంతల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా రైతు

● పెంబి మండలం ఇటిక్యాల్ గ్రామంలో..

పెంబి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలోని ఎస్సీ, బీసీ, మైనారిటీ పోడు భూముల రైతులకు అటవీ శాఖ అధికారుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గత కొన్ని సంవత్సరాల నుంచి సాగుచేస్తున్న పోడు భూముల్లో మంగళవారం ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటడంతో విషయం తెలుసుకున్న ఇటిక్యాల్ పోడు రైతులు ఫారెస్ట్ అధికారులను మొక్కలు నాటకుండా అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. మొక్కలు నాటకుండా పోడు రైతులు గుంతల వద్ద నేలపై పండుకొని నిరసన వ్యక్తం చేశారు. 1985 నుంచి సాగు చేస్తున్న భూములకు ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధించారని దాదాపు 75 ఎకరాల భూమిలో 50 మంది రైతులు సాగు చేసుకుంటున్న భూమిలో ఇప్పుడు ఫారెస్ట్ అధికారులు ఆ భూములు మావి అనడం ఏంటని ప్రశ్నించారు. దాదాపు రెండు గంటలు రైతులకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. రైతులు ఎక్కువ గొడవ చేయడంతో అక్కడి నుండి ఫారెస్ట్ అధికారులు వెళ్లిపోయారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్ రెడ్డి పోడు రైతులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు ఉన్నారు.



అటవీ శాఖ అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం



వరద నీటిలో కాల్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం



వరి ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో రోడ్డుపై ఉన్న లారీ వద్దకు తరలిస్తున్న దృశ్యం

రైతు కష్టం.. నీటి పాలు!

- వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం
- బస్తాల్లో మొలకెత్తుతున్న ధాన్యం
- అన్నదాతను నిండా ముంచిన వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో అదనంగా ధాన్యం తూకం!



తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

దిలావర్‌పూర్, మే27 (ఆంధ్రజ్యోతి): వర్షానికి రైతు కష్టమంతా నీటిపాలైంది. పొద్దుమాపు కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునే తరుణంలోనే మొలకెత్తింది. అన్నదాత పరిస్థితి దయనీయంగా మారింది. రైతులు ఏప్రిల్ మొదటి వారం నుంచే వరి ధాన్యం కోతలు మొదలుపెట్టారు. అయితే వరిధాన్యం కేంద్రాలను మాత్రం మూడో వారంలో ప్రారంభించారు. మండలంలో మొత్తం 14 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 8, డీఆర్ డీఏ (ఐకేపీ) ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడం కూడా రైతులు నష్టపోవడానికి కారణమైందని రైతులు చెప్తున్నారు. అందుకు కారణం కూడా లేకపోలేదు. హమాలీల కొరత వల్లే కేంద్రాల ప్రారంభం ఆలస్యమయినప్పటికీ దాని ప్రతిఫలం తాము అనుభవించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు

వరి ధాన్యం కోత మొదలు రైతులు అనుభవిస్తున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. మ్యాచర్ రావడం లేదని, వడ్లు ఎండబెట్టాలని నిర్వాహకులు ఒత్తిడి, అటు మ్యాచర్ వచ్చిన బ్యాగుల్లో నింపేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే గడపాల్సి వచ్చింది. వాస్తవంగా తూకం వేసే వరకు రైతుల బాధ్యత ఉంటుంది. తూకం వేశాక ధాన్యం మిల్లులకు తరలించే వరకు నిర్వాహకులు చూసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా కాకుండా ధాన్యం మిల్లులకు తరలిపోయే వరకు బాధ్యతతో పాటు భారమంతా రైతులే మోయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం అమ్మి మిల్లుకు పోయేవరకు రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతుండటంతో అటు ఖరీఫ్ సాగు పనులు వెనకపడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అదనంగా ధాన్యం తూకం

రైతులు ధాన్యం అమ్ముకునేందుకు కష్టాలు చాలావన్నట్లు మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా అదనంగా ధాన్యం తూకం వేయడం రైతులను తీవ్రంగా కలిచి వేస్తోంది. ఒక బస్తాలో 40కిలోల 800 గ్రాముల ధాన్యం తూకం వేయాల్సి ఉండగా నిర్వాహకులు తాలు, తప్ప పేరుతో 43 కిలోల 500 గ్రాములు తూకం వేస్తున్నారు. రైతులకు డబ్బులు చెల్లించేది మాత్రం 40 కేజీలకే. ఈ లెక్కన క్వింటా ధాన్యానికి 8 కేజీల నుంచి 10 కిలోల ధాన్యాన్ని రైతులు నష్టపోతున్నారు. ఇంత నష్టపోయి నప్పటికీ లోలోపల మదన పడుతున్న రైతులకు మళ్లీ రైస్ మిల్లర్లు షాక్ ఇస్తున్నారు. మ్యాచర్ రావడం లేదని, ధాన్యం తడిసి పోయిందని బస్తాకు రెండు మూడు కిలోల ధాన్యం కోత విధిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతులను నిండా ముంచిన వర్షం

అనేక కష్టాలను తట్టుకుని గుండె నిబ్బరం చేసుకుంటున్న రైతులకు అకాల వర్షం మరింత ఆపదలోకి నెట్టింది. వారం రోజుల నుంచి కురుస్తున్న వానలు రైతులను తిండికి, నిద్రకు దూరం చేస్తోంది. కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి పోకుండా రైతులు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. ఎంత చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయి మొలకెత్తుతోంది. కొనుగోలు కేంద్రాలన్నీ వర్షం నీటితో కుంటలను తలపిస్తున్నాయి. చిత్తడి చిత్తడిగా మారాయి. బస్తాల్లో నింపిన ధాన్యానికి బూజు పడుతోంది. ధాన్యం ఆరబెట్టేందుకు కూడా వర్షాలు అవకాశం ఇవ్వకుండా రైతులను నిండా ముంచుతున్నాయి. నాయకులు, అధికారులు చెప్పేదానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికి పోలికే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అదనపు కోతలు చేయకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి నిజాయితీని, విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని నాయకులను, అధికారులను రైతులు వేడుకుంటున్నారు.



కొనుగోలు కేంద్రంలో నీళ్ల మధ్య ధాన్యం కుప్పలు



తడిసి ముద్దయిన ధాన్యం

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



• వైన్స్ నర్సయ్య, వరి రైతు, కాల్వ

ఎంత ప్రయత్నించినా ధాన్యం తడిసిపోయింది. రూ.11,500 పెట్టి టార్పాలిన్ తెచ్చి కప్పినా లాభం లేకుండా పోతోంది. అడుగు నుంచి నీరు ప్రవహించి వడ్లు తడిసి పోతున్నాయి. మా కష్టాన్ని అర్థం చేసుకుని ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. తడిసిన ధాన్యం కొంటామని మంత్రులు, నాయకులు, అధికారులు చెబుతున్నా ఇక్కడ జరిగేది వేరుగా ఉంది. ప్రభుత్వం స్పందించాలి.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి



• సాయన్న, రైతు, కాల్వ

ధాన్యం విక్రయించడం పెద్ద కష్టంగా ఉంది. కొనుగోలు కేంద్రానికి వచ్చి 15 రోజులవుతున్నా నేటికీ వడ్లు ఇంకా తూకం వేయలేదు. సెంటర్ మొత్తం బురద అయ్యింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం మాపై కొంత దయ ఉంచి వడ్లను కొనుగోలు చేయాలి.



శిబిరంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మొక్కుబడిగా విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరం

● శిబిరంపై ప్రచారం కరువు ● స్పందనా అంతంత మాత్రమే

బాసర, మే 27 (ఆంధ్రజ్యోతి): బాసర మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరం మొక్కుబడిగా సాగింది. విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ శిబిరం అరుదుగా ఏర్పాటుచేస్తారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంమూడేళ్ల తరువాత బాసరలో ఏర్పాటు చేశారు. ప్రచారం లేకపోవడం, లేకపోవడంతో ఆశించిన స్పందన రాలేదు. విద్యుత్ శాఖ అధికార సిబ్బందితో పరిచయస్తులు మాత్రమే కొంతమంది శిబిరానికి హాజరై తమ సమస్యలను తెలియజేశారు. ఫోరం అధ్యక్షుడు ఏరుకల నారాయణ, సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్ హాజరయ్యారు. బాసరతోపాటు సబ్‌డివిజన్ పరిధిలో గల ముథోల్, తానూర్, లోకేశ్వరం మండలాల వినియోగాదారుల కోసం దీన్ని ఏర్పాటు చేశారు. నాలుగు మండలాల పరిధిలో మంగళవారం నాటి శిబిరానికి కేవలం 24 మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. దీన్ని బట్టి మంగళవారం జరిగిన శిబిరం తూతూ మంత్రంగా నిర్వహించినట్లు తెలిసిపోతోంది.

అధికారులపై రైతుల ఆగ్రహం

వచ్చిన కొద్దిమంది విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ఫోరం కమిటీ సమక్షంలో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ సమస్యలకు సరిగా పట్టించుకోవడం లేదని, సమస్యలు వినేవారే కరువవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా కరెంటు తీగలు ఉన్నాయని చెప్పినా చర్యలు తీసుకోవడం లేదంటూ మరికొంత ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులు పట్టించుకోపోవడంతోనే వినియోగదారులు సమస్యలు ఎదుర్కొంటుంటే.. మంగళవారం కూడా స్థానిక అధికారులే వినియోగదారుల సమస్యలను తెలుసుకోవడం విచిత్రంగా కనిపించింది. సమాధానాలు చెప్పే ఫోరం సభ్యులను కలువకుండా సమస్యలను విన్నవించేందుకు వచ్చిన వినియోగదారులను సముదాయిస్తూ మండలస్థాయి అధికారులే తిప్పిపంపించడం కనిపించింది.

వదన్నా ఇంటి వద్ద స్తంభం వేశారు



● సుమలత, మైలాపూర్ గ్రామం

పదేపదే చెప్పినా వినకుండా ఇంటి వద్ద పెద్దలైన్ స్తంభం వేశారు. స్తంభం మాకు సమస్యగా మారింది. తీయమంటే డబ్బులు కట్టాలని చెప్తున్నారు.

సీఎంకే చెప్పుకోమంటున్నారు..



● సతీష్, రైతు

పంట పొలాల్లో వ్యవసాయ విద్యుత్‌లైన్ స్తంబాలు ఒకేవైపు వంగిపోయి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ తీగలు కిందికి జారుతున్నాయి. ఎవరికైనా తగిలితే ప్రమాదం జరుగుతుందని సమస్యలు శిబిరానికి వచ్చి అధికారులకు చెప్పుకుంటే సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పుకోమని సమాధానం చెప్పారు.

రేపు శ్రీదత్త అనఘా వ్రతం

నిర్మల్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని దత్తసాయి ఆలయం గురువారం ఉదయం 9:30 గంటలకు సామూహిక శ్రీదత్తఅనఘా వ్రతం నిర్వహిస్తున్నట్లు సాయి దీక్ష ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు పూజా సామగ్రితో రావాలని కోరింది.

శిథిలావస్థకు చేరుతున్న ప్రభుత్వ భవనాలు

● వృథాగా రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ● పట్టించుకోని అధికారులు



శిథిల దశకు చేరిన తాపీ మేస్త్రీ శిక్షణ భవనం

ఉట్నూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాజుల సైసా రాళ్లపాలు అన్న చందంగా ప్రభుత్వ అధికారుల అనాలోచిత వైఖరి కారణంగా లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలదశకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా గతంలో చేసిన పనులను ప్రస్తుత అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు మారిన ఉన్నతాధికారులు రూపొందించిన పనులు మాత్రం యధావిధిగా నడిపించేలా వచ్చిన అధికారులు కృషి చేయాల్సి ఉన్న పాతఅధికారులు చేసిన పనులను ముట్టుకోవడం లేదు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నిరుద్యోగ గిరిజన యువతకు తాపీ మేస్త్రీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించవచ్చని గతంలో ఉన్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో సుమారు రూ.20లక్షల వరకు వెచ్చించి తాపీ మేస్త్రీ శిక్షణ భవనాన్ని నిర్మించారు. రెండు మూడేళ్ల పాటు తాపీ మేస్త్రీ శిక్షణ పొందిన గిరిజన యువకులు ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పనులు చేపట్టి ఉపాధి పొందారు. అనంతరం రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వచ్చిన అధికారులు తాపీ మేస్త్రీ శిక్షణ భవనాన్ని ఉపయోగించుకోకుండా నిరుద్యోగ యువతకు శిక్షణలో అవకాశం ఇవ్వలేదు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలదశకు చేరుకుంది. దశాబ్దకాలంగా భవనాన్ని పట్టించుకోకపోవడంతో ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పోకిరీలకు అడ్డాగా మారింది.

● ఏడీఏ కార్యాలయం ఎత్తి వేతతో నిరుపయోగంగా భవనం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గానికి ఒక వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఖానాపూర్ నియోజకవర్గం కేంద్రంలో ఏడీఏ కార్యాలయం ఉండడంతో ఉట్నూర్‌లో ఉన్న ఏడీఏ కార్యాలయాన్ని బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండల కేంద్రానికి తరలించారు. ఈ ప్రాంత రైతుల డిమాండ్ మేరకు తిరిగి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు మాత్రం ఇన్‌చార్జీ అధికారిని నియమించి కార్యాలయ సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో దశాబ్దాకాలంగా భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనం సమీపంలో ఐదు దశాబ్దాలకు ముందే నిర్మించిన వ్యవసాయ రేకుల గిడ్డంగి ఉపయోగంలో లేకపోవడంతో శిథిలం అవుతోంది. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు నిరుపయోగంగా మారిన తాపీ మేస్త్రీల భవనం ఇతర కార్యాలయాల కోసం అయినా కేటాయించి ఉపయోగంలోకి తేవాలని, అదేవిధంగా వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయానికి రెగ్యూలర్ ఏడీఏని నియమించి పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రాంతాల రైతులు కోరుతున్నారు.



ఉపయోగంలో లేక శిథిలమవుతున్న వ్యవసాయ శాఖ భవనం

జైనథ్, ఇచ్చోడలో భారీ వర్షం

● జనజీవనం అస్తవ్యస్తం ● తడిసి ముద్దవుతున్న జొన్నపంట ● ఎక్కడికక్కడ నిలిచిన జొన్నపంట వాహనాలు



జైనథ్‌లో వర్షంలో ఆగిపోయిన జొన్నపంట వాహనాలు



జైనథ్ మార్కెట్ యార్డులో తడిసి ముద్దయిన జొన్నపంట

జైనథ్, మే 27 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. భారీ వర్షంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు జైనథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా చేపడుతున్న జొన్న కొనుగోలుకు ఆయా గ్రామాల రైతులు తమ జొన్న పంటను కొనుగోలు చేయడానికి పెద్దసంఖ్యలో వివిధ వాహనాలో జొన్న పంటను తీసుకువచ్చారు. మార్కెట్ యార్డులో రైతులు కుప్పలు బోసి తాడి పత్రులతో కప్పిన జొన్నపంట భారీ వర్షానికి తడిసి ముద్దయింది. ఆరుగాళం పండించిన జొన్నపంట తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ఆయా గ్రామాల నుంచి అమ్మడానికి తీసుకవచ్చిన జొన్న పంట తాడి పత్రిలు చుట్టినా తమ పంటను ఎప్పుడు అమ్ముతామో లేదోన్న దానిపై దిగులు పడుతున్నారు.

నిండా ముంచిన వాన

ఇచ్చోడ: అప్పటి వరకు మండె ఎండతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఇచ్చోడ పట్టణంలోని వ్యాపార సముదాయాలు అతలాకుతలమయ్యాయి. దుకాణాలలోనికి, కాలనీరోడ్లు వరదనీటితో నిండిపోయాయి. ఇచ్చోడ మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన రెండు వరుసల రహదారికి ఇరువైపులా మురుగుకాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి దుకాణాల్లో, కాలనీరోడ్లపై నీరు నిలిచింది. మురుగుకాలువల్లో పూడిక తీయకపోవడం, రోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు ముందుకు సాగలేక రోడ్డు పక్కనే ఉన్న దుకాణ సముదాయాల్లోకి వెళ్లింది. దీంతో వరదనీరు దుకాణాల్లోకి చేరడంతో వ్యాపారస్థులు లబోదిబోమన్నారు. వర్షాకాలంలో వచ్చే ముసురువర్షాలకు ఇచ్చోడ పట్టణం నిండా మునిగిపోతుందేమోనని స్థానికులు ఆవేదన చెందతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు ఇచ్చోడ సమస్యపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వరదతో నిండిన టాకీస్ రోడ్డు



దుకాణ సముదాయాల్లో చేరిన నీరు

ఇలాంటి వర్షకాలాన్ని తాము ఎప్పుడు చూడలేదు



• సామ వెంకట్‌రెడ్డి, జొన్నరైతు, దీపాయిగూడ

ఇలాంటి అకాల వర్షం ఎప్పుడు చూడలేదు. వర్షానికి జొన్న పంట కళ్ల ముందు తడిసి ముద్దయింది. మా ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గమనించి మమ్మల్ని ఆదుకోవాలి.



నేరడిగొండ మండలంలో అధికారులను అడ్డుకుంటున్న గిరిజన రైతులు(ఫైల్)

మొదలైన.. పోడు లొల్లి!



- వర్షాలు కురవడంతో పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఎకరాల్లో పంటల సాగు.. గుంటల భూమికే పోడు పట్టాలు
- పోడు భూముల్లో ముళ్లకంచె విత్తనాలను చల్లుతున్న అటవీ శాఖ
- అధికారులతో వాగ్వాదానికి దిగుతూ అడ్డుకుంటున్న అన్నదాతలు
- ఏళ్లు గడుస్తున్నా.. శాశ్వత పరిష్కారం చూపని ప్రభుత్వాలు
- జిల్లాలో లక్షా 83 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం

ఆదిలాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లా రైతులకు పోడు భూముల కోసం పోరాటం చేయక తప్పడం లేదు. ఈ యేడు తొలకరికి ముందే వర్షాలు కురవడంతో గంపెడు ఆశలతో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం పోడు పట్టాలను అందించింది. పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వక పోవడంతో పోడు సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమైనట్లు కనిపించడం లేదు. జిల్లాలో అటవీ ప్రాంతం లక్షా 83వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అర్హులైన నిరుపేదలకు పోడు పట్టాలు అందించాల్సి ఉండగా.. ప్రభుత్వం అరకొరగానే పట్టాలను అందించి చేతులు దులుపుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో జిల్లాలో ఇంకా వేల మంది రైతులకు పూర్తిస్థాయిలో పోడు పట్టాలు అందక పోవడంతో మళ్లీ వివాదాలకు దారి తీస్తుంది. ఈ యేడు వర్షాలు కురియడంతో మళ్లీ పోడు భూముల్లో ముళ్ల కంచె విత్తనాలను చల్లెందుకు అటవీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు అడ్డుకోవడంతో కొత్త వివాదాలకు కారణమవుతుంది. పోడు భూముల్లో పంటల సాగును అటవీ శాఖ అధికారులు నిరాకరించడంతో రైతులు నేతల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అటవీ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూముల సాగును అడ్డుకుంటే సహించేది లేదంటూ హెచ్చరికలు చేయడం ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీస్తుంది.

పేరుకే పోడు పట్టాలు

గత ప్రభుత్వ హయాంలో అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వేలల్లో దరఖాస్తులు రాగా.. వందల్లోనే పోడు పట్టాలను జారీ చేశారు. అలాగే ఎకరాల విస్తీర్ణంకు దరఖాస్తు చేసుకున్న రైతులకు గుంటల్లోనే పట్టాలను జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఉదాహరణకు ఒక రైతు ఐదు ఎకరాలకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం కేవలం 5-10 గుంటలకే పోడుపట్టాలను ఇచ్చింది. ఎన్నో ఏళ్లుగా పోడుభూముల్లో పంటలను సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నా.. అటవీ శాఖ అధికారులు మాత్రం వినిపించుకోవడం లేదంటున్నారు. ఎందుకంటే ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టా మేరకే సాగు చేసుకోవాలని అధికారులు కొర్రీలు పెట్టడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. ఏళ్ల తరబడి కాస్తులో ఉండి పంటలను సాగు చేసుకుంటున్నా.. గుంటల్లోనే పోడు పట్టాలు రావడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. హద్దులు దాటి పంటలను సాగు చేస్తే ఊరుకునేది లేదంటూ అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. అంతేకాకుండా గతంలో రైతులు కాస్తులో ఉన్న భూమిని సర్వే చేసి పోడు పట్టాలను జారీ చేసి ఉంటే.. ప్రస్తుతం ఈ పరిస్థితి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అప్రమత్తమైన అటవీ శాఖ

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమవుతున్నారు. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో నిఘాను సారిస్తున్నారు. అటవీ హద్దులు దాటి పోడు భూముల్లో పంటలను సాగు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. పట్టాలేని పక్షంలో ఆక్రమిత పోడు భూమిని వదిలి పెట్టి వెళ్లాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో ముళ్ల కంచె విత్తనాలను చల్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో పోడుసాగుకు అడుగడుగునా.. అడ్డంకులే ఎదురవుతున్నాయి. రైతులు చదును చేసుకున్న భూముల్లో గుంతలు తవ్వి మొక్కలు నాటడంతో పాటు ముళ్ల పొదలను పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం అధికారుల బెదిరింపులతో భయం భయంగానే సాగు చేయాల్సి వస్తుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చాలా గ్రామాలలో గిరిజనేతర రైతులు కూడా పోడు భూములను సాగు చేసుకోవడం వివాదాలకు కారణమవుతుంది.

అధికారులతో రైతుల వాగ్వాదం

పోడు భూముల్లో పంటలను సాగు చేయవద్దంటూ అధికారులు అడ్డుకోవడంతో రైతులు వాగ్వాదానికి దిగుతున్నారు. నేరడిగొండ, బోథ్, సిరికొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లో పోడు భూములపై లొల్లి కనిపిస్తుంది. ఇటీవల నేరడిగొండ మండలం పీచర

(తరువాయి 6వ పేజీలో...)



జేసీబీ ద్వారా గుంతలు తీస్తున్న అధికారులు



అటవీశాఖ అధికారితో వాగ్వాదానికి దిగిన కౌటా(బి) గ్రామ రైతులు

వివాదాస్పద భూమిలో చెట్లు నాటేందుకు అటవీ శాఖ యత్నం

- భూముల జోలికి రావద్దని సాగు రైతుల ఆందోళన

బోథ్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామం సమీపంలోని అటవీ శాఖ వారి భూముల్లో చెట్లు నాటేందుకు మంగళవారం ఆ శాఖ అధికారులు వచ్చారు. అయితే, విషయం తెలుసుకున్న అటవీ భూముల సాగుదారులు అటవీ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. గతంలో కౌటా(బి) గ్రామానికి చెందిన ఓ రైతు అటవీ భూమిని సాగు చేయడంపై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అప్పటి అటవీశాఖ అధికారి ఆధ్వర్యంలో మూడున్నర ఎకరాల భూమిలో మొక్కలు నాటారు. కాగా, అందులో నుంచి మొక్కలను తొలగించి ఈ ఏడాది సహితం పంట వేసేందుకు భూమిని దున్ని సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీంతో అటవీ భూముల్లో సాగు చేస్తున్నవారు ఒకేసారి వచ్చి జేసీబీని అడ్డుకోవడంతో పాటు రేంజి అధికారితో వాగ్వాదానికి దిగారు. దీంతో రేంజ్ అధికారి రైతులతో మాట్లాడారు. గతంలో ఈ భూమిలో మొక్కలు నాటడం జరిగిందని, అయితే ఈ భూమి కోర్టు వివాదంలో ఉన్నందున ఎవరూ భూమిలో పంటలు వేయరాదని, అందుకు తాము వచ్చామని వివరించారు. అయితే రైతులు మాత్రం అటవీ భూముల్లో మొక్కలు నాట వద్దంటూ జేసీబీ ముందు కూర్చున్నారు.

- అడ్డుకోవద్దు : రేంజ్ అధికారి

కోర్టు వివాదంలో ఉన్న భూమిలో ఎవరూ పంట సాగు చేయవద్దని, అయితే అటవీ భూముల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటుతామని రేంజ్ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. దీంతో సాగుదారులు తమ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాగా, ప్రస్తుతం తాము కోర్టు వివాదంలో ఉన్న భూమి విషయంలో వచ్చామని, భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై తదుపరి చర్యలు ఉంటాయని సాగు రైతులకు అధికారి వివరించారు. కాగా, వారం రోజుల పాటు తమకు గడువు ఇవ్వాలని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకుంటామని రైతులు కోరారు. దీంతో అటవీశాఖ అధికారులు సాగు భూముల రైతు కోరిక మేరకు జేసీబీని అక్కడి నుంచి పంపించి వేశారు. వారం తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని రేంజ్ అధికారి స్పష్టం చేశారు.

'నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయించే వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ జిల్లా లీగల్ అడ్వైజర్ రాథోడ్ సుభాష్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అక్రమంగా జొన్నలు తీసుకు వస్తున్న వారిపై. వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో కాలనీవాసులకు తప్పని తిప్పలు

ఆదిలాబాద్ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో డ్రైనేజీలోని మురుగునీరు రోడ్లపైకి రావటంతో ఇబ్బందులకు గురవుతున్నామని మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ అన్నారు. బుద్ధ విహార్ వద్ద గల పెద్ద డ్రైనేజీ పనులు నిర్మాణ వ్యవస్థలోనే ఆగిపోవడంతో తెలంగాణ చౌక నుంచి పంజాబ్ చౌక్ వైపు వెళ్లే మురుగునీరు కాలనీలోకి వస్తుందన్నారు. నిర్మాణాన్ని పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

భూముల కొలతలలో సర్వేయర్ల పాత్ర కీలకం

- మెటీరియల్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): భూముల కొలతలలో సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏడీ సర్వేలాండ్ రాజేందర్‌తో కలిసి సర్వేయర్లకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ భూమి సరిహద్దులను గుర్తించడం, వివిధ సందర్భాలలో నిర్వహించే సర్వే సమయంలో సర్వేయర్ల పాత్ర కీలకమనిఅన్నారు. అలాగే భూములకు సంబంధించి శిక్షణలో అన్ని అంశాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూమి సరిహద్దులను గుర్తించడం, కొలతలను తీసుకోవడం, భూమి యొక్క నమునాలను తయారు చేయడం ద్వారా సర్వేయర్లు భూమిని సరిగ్గా ఉపయోగించుకోవడానికి ప్లాన్ చేయడానికి సహాయ పడతారన్నారు. వారు వివిధ రకాల సర్వేలను నిర్వహించి భూమి స్థానం, కోణం, దూరాన్ని నిర్ణయించడానికి సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తారన్నారు. అదే విధంగా ప్రత్యేకించి రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లదే ముఖ్యపాత్ర అని తెలిపారు. సర్వేయర్లు శిక్షణకు హాజరై జాగ్రత్తగా అన్ని అంశాలను క్షుణంగా విని అర్థం చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చే నిర్వాహకులు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని, శిక్షణకు హాజరైన సర్వేయర్లు ప్రతి అంశం పై సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇందులో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఉట్నూర్ రామేశ్వర్, సర్వేయర్ గోవింద్‌రావ్,నిషార్ అమ్మద్, ఫ్యాకల్టి తల్మీనోద్దీన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేయర్లకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్వేయర్లు

జిల్లా ఆసుపత్రిలో నేడు రక్తదాన శిబిరం

ఉట్నూర్, మే 27(ఆంధ్రజ్యోతి): పరివర్తన్ ఫౌండేన్ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించ తలపెట్టినట్లు ఉట్నూర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్ ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా అత్యవసర సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని అత్యవసరంలో అవసరమైన వారికి అందించి ప్రాణాలు కాపాడడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏజెన్సీలోని యువత రక్తదానం చేసి అత్యవసర రోగులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.



రోలర్‌తో సైలెన్సర్‌లను తొక్కిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మాడిఫైడ్ సైలెన్సర్లకు చెక్

- సైలెన్సర్‌లను రోలర్‌తో తొక్కించిన పోలీసులు
- అలాంటివి వాడితే చర్యలు : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): అధిక శబ్దంతో వెళ్తున్న ద్విచక్ర వాహనాలపై ఆదిలాబాద్ పోలీసులు కొరడా ఝూలిపించారు. మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చౌరస్తా వద్ద సుమారు 160 సైలెన్సర్‌లను రోడ్డు రోలర్‌తో తొక్కించి నుజ్జునుజ్జు చేశారు. సైలెన్సర్‌లను బిగించిన మెకానికల్‌పై సైతం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మాడిఫైడ్ సైలెన్సర్‌ల వల్ల వృద్ధులకు, చిన్నపిల్లలకు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి.సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావు, ప్రణయ్ కుమార్, ఎస్సైలు మహేందర్, దేవేందర్, ట్రాఫిక్ సిబ్బంది రాజేష్, రామకృష్ణ రమేష్, ఫిరోజ్, విజయ్, సతీష్, రామకృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర జొన్నల లారీ పట్టివేత

ఇచ్చోడ, మే 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి ఇచ్చోడకు వస్తున్న జొన్నల లారీని పట్టుకున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్ర నుంచి అక్రమంగా తీసుకువస్తున్న జొన్నల లారీని సీతాగొంది ప్రాంతంలో పట్టుకున్నట్లు ఆయన వివరించారు. పట్టుకున్న లారీలో 300 క్వింటాళ్ల జొన్నలు ఉన్నయాని, పంచానామా నిర్వహించి స్టాక్‌ను ఇచ్చోడ మార్కెట్‌లో సీజ్ చేశామన్నారు.

జిల్లా అంతటా భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన జొన్నలు
- తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న అన్నదాతలు
- అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 29.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): గత నాలుగైదు రోజులుగా జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 1.4మి.మీ.లు కాగా, అధికంగా 8.3 మి.మీ.ల వర్షపాతం కురిసింది. అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 29.5 మి.మీ.లు, ఇంద్రవెల్లిలో 25.4, గుడిహత్నూర్‌లో 23.9, నార్నూర్‌లో 20.3, ఆదిలాబాద్‌లో 20.5, మావలలో 10.7 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి జిల్లా కేంద్రంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మురుగునీటి కాల్వలు ఉధృతంగా ప్రవహించడంతో ఇళ్లలోకి మురికినీరు చేరింది. ముఖ్యంగా భుక్తాపూర్ కాలనీలోని పలు ఇళ్లలోకి మురికినీరు చేరింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలలో జొన్నలు తడిసి ముద్దయ్యాయి. పంటలను అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కొందరు రైతులైతే కొనుగోళ్ల కేంద్రాల్లోనే జొన్నలను వదిలేసి సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.



జిల్లాకేంద్రంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

ఉట్నూర్: ఉట్నూర్ మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటల పాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి శ్యామ్‌పూర్ పెర్కగూడెం, వాగులు పొంగి ప్రవహించగా శ్యామ్‌పూర్ నుంచి తాంఢ్రవైపు వెళ్లే రహదారిపై ఉన్న సుంగుగూడ లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించింది. సోమవారం అర్ధరాత్రి సైతం భారీ ఉరుములు, పిడుగుల శబ్దాలు గంటట పాటు ఎడతెరిపి లేకుండా రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీనికి తోడు విద్యుత్ అధికారులు సైతం విద్యుత్ అంతరాయం కలిగించడంతో ప్రజలు మరింత ఇబ్బందికి లోనయ్యారు. ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న శ్యామ్‌పూర్, పులిమడుగు, కుమ్మరితండా, ఎందా, ఉమ్రి, నర్సాపూర్, తదితర గ్రామాలలో కరెంట్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది సోమవారం రాత్రి విద్యుత్ తీగలను తనిఖీ చేస్తు వెళ్లగా మంగళవారం నాలుగు గంటలకు పాల్ట్ కనుక్కొని కరెంట్ పునరుద్ధరించారు. మండలంలోని శ్యామ్‌పూర్‌లో వారసంతకు వచ్చిన వ్యాపారులు ప్రజల సైతం భారీ వర్షానికి ఇబ్బంది పడ్డారు. భారీ వర్షానికి సుంగుగూడ లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో సుంగాగూడా, రాజన్నగూడ, తాండ్ర, తదితర గ్రామాల ప్రజలు కుమ్మరితండా వైపు నుంచి సాలెవాడ(బి) మీదుగా గ్రామాలకు రాకపోకలు సాగించారు. శ్యామ్‌పూర్, నాగపూర్, పెరకగూడెం వాగులు సైతం భారీ వర్షానికి పొంగి ప్రవహించాయి. వర్షాకాలం కంటే ముందు ముందస్తు వర్షాలు రావడంతో విత్తనాలు నాటుకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.



శ్యామ్‌పూర్‌లో కురుస్తున్న వర్షం



సుంగాగూడలో లోలెవల్ వంతెనపై నుంచి పారుతున్న వరదనీటిలో నుంచి బయటకు వెళ్లలేక వెనక్కి వెళ్తున్న వ్యక్తి